ఇటుక బట్టీల్లో బాల్యం బుగ్గి

- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు
- బడి బయటి పిల్లల సర్వే పేరుకే అంటున్న విద్యావంతులు
- ఈ సారైనా పటిష్ట చర్యలు చేపట్టాలని సూచనలు



మహమ్మదాబాద్: ప్రభుత్వం బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలని.. బడిఈడు కల్గిన బాలబాలికలు పాఠశాలల్లో ఉండాలని ఎన్నో చట్టాలు చేస్తున్నా అవి కేవలం సర్వేలకే పరిమితం అవుతున్నాయి. దీంతో ఎంతోమంది బాలకార్మికులు గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇటుకబటీల్లో, పౌల్ట్రీల్లో మగ్గుతున్నారు. ఏటా బాలకార్మికులపై సర్వేలు నిర్వహించాలని ఆదేశాలు రావడం.. సంబంధిత అధికారులు తూతూ మంత్రంగా పూర్తి చేసి పంపడం పరిపాటిగా మారింది. కానీ పరిస్థితులు మాత్రం మారడం లేదు. గత ఏడాది సైతం అధికారులు 10 మంది వరకు బాల కార్మికులను గుర్తించినట్టు లెక్కలు చెబుతున్నారు. ఈఏడాది దాదాపు 30మంది వరకు బాలకార్మికులు ఉన్నారని అంచనాలు వేస్తున్నారు. పూర్తిసర్వేలు చేస్తేగానీ వివరాలు తెలియదంటున్నారు. కానీ ఇవేవీ పొంతన లేనివని పలువురు విమర్శిస్తున్నారు. వివిధ పనుల్లో కార్మికులుగా ఉంటూ ఎంతో మంది బాలలు బడులకు దూరమవుతున్నారని వాపోతున్నారు. ఉమ్మడి మండల వ్యాప్తంగా కంచన్‌పల్లి, మహమ్మదాబాద్, వెంకట్‌రెడ్డిపల్లి, గాధిర్యాల్, నంచర్ల, కొంరెడ్డిపల్లి, జిన్నారం, జూనంపల్లి, జక్లపల్లి తదితర గ్రామాల్లో జోరుగా ఇటుకబట్టీలు, పౌల్ట్రీలు, రైస్‌మిల్లులు కొనసాగుతున్నాయి. చాలా వాటిల్లో బాలకార్మికులు పనులు చేస్తున్నారని చెబుతున్నారు.

పేరుకే సర్వేలు..

ఉమ్మడి మండల వ్యాప్తంగా ఆయా గ్రామాల్లో బాలలు ఇటుకబట్టీల్లో, పౌల్ట్రీల్లో కుటుంబసభ్యులతో పాటు పనుల్లో చేరుతున్నారు. అలాంటి పనులు చేసే వారి వివరాలు మొదట్లో సర్వేల పేరుతో అధికారులు సేకరిస్తున్నారు. వారిని బడుల్లో చేర్పించినట్టుగా లెక్కలు మాత్రం చెబుతున్నారు. తీరా వారిని పరిశీలిస్తే మాత్రం మళ్లీ యధాతథంగా ఆయా చోట్ల పనులు చేస్తున్నారు. అదేవిధంగా బాలకార్మికులుగా పిల్లలు పనులు చేస్తున్నా సంబంధిత అధికారులు మాత్రం వారి తల్లిదండ్రులకు, బట్టీలు, పౌల్ట్రీల యజమానులకు అవగాహన కల్పించలేకపోతున్నారు. దీంతో ఎంతో మంది పిల్లల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోంది.

బయటి ప్రాంతాల వారే ఎక్కువ

ఉమ్మడి మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఇటుకబట్టీల్లో, పౌల్ట్రీల్లో పనిచేస్తున్న వారిలో ఎక్కువ శాతం బయటి రాష్ట్రాలు, ఇతర జిల్లాల నుంచి వచ్చినవారు ఉంటున్నారు. దీంతో వారితోపాటు వచ్చే బాలలు కూడా పనుల్లో నిమగ్నం అవుతున్నారు. ఇలా ఎంతోమంది పనులు చేస్తున్నా ఎవరికీ పట్టడం లేదు. ఎంతమంది ఉన్నారు? ఎక్కడి నుంచి వచ్చారు? వారి పరిస్థితి ఏమిటన్నది సంబంధిత అధికారులు మాత్రం తెలుసుకోవడం లేదు. కొంతమందిని పాఠశాలల్లో చేర్పిస్తున్నా మళ్లీ పరిస్థితి మొదటికి వస్తోంది.

చర్యలు చేపట్టాలి



గ్రామాల్లోని ఇటుకబట్టీల్లో, పౌల్ట్రీల్లో, రైస్ మిల్లుల్లో ఎంతో మంది బాలకార్మికులు పనిచేస్తున్నారు. అలాంటి వారిని సంబంధిత అధికారులు వెంటనే వారి తల్లిదండ్రులతో మాట్లాడి విడుదల చేసి పాఠశాలలకు పంపించాలి. ఎన్నో సంవత్సరాలుగా కార్మికులుగా ఉంటున్నా అధికారులు మాత్రం సర్వేలు చేసుకుని వదిలేస్తున్నారు. ఈ సారైనా పటిష్టంగా చర్యలు చేపట్టాలి.

– వేణుగౌడ్, మహమ్మదాబాద్

అధికారుల నిర్లక్ష్యమే కారణం



బడి ఈడు కల్గిన పిల్లలు పాఠశాలకు వెళ్లకపోవడం, పనుల్లో చేరడంలో అధికారుల నిర్లక్ష్యం కనబడుతోంది. ఏటా బడుల ప్రారంభ సమయంలో బాలకార్మికుల వివరాలు సేకరించాలి. జూనంపల్లి లాంటి ఇటుకబట్టీల్లో ఇతర పనుల్లో ఎంతోమంది పనులు చేస్తున్నారు. వారిని దగ్గర్లోని వసతిగృహాలకు పంపించి విద్యనందించాలి.

– కేశవులు, జూనంపల్లి

తల్లిదండ్రులు సహకరించాలి

ఆయా గ్రామాల్లో వివిధ పనుల్లో చేరిన బాలకార్మికులను గుర్తించేందుకు సర్వేలు చేస్తున్నాం. వారి వివరాలను సేకరించి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాఠశాలల్లో పేర్లు నమోదు చేసుకుని విద్యను అందిస్తాం. అయితే ఇందుకు తల్లిదండ్రుల సహకారం పూర్తిగా అవసరం. వారికి అవగాహన కల్పిస్తున్నాం. పనిలో పెట్టుకున్న వారిపై చర్యలు తప్పవు.

– వెంకటయ్య, మండల విద్యాధికారి

క్లుప్తంగా

మేనిఫెస్టో అమలు చేయాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: నూతనంగా అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, కార్మికుల మేనిఫెస్టో ద్వారా ఆ వర్గాలకు మేలు జరుగుతుందని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జయలక్ష్మి అన్నారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానంగా స్కీం వర్కర్లైన అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం, వీఓఏలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మున్సిపల్, గ్రామ పంచాయితీ వర్కర్ల జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. నాయకులు కిల్లెగోపాల్, కురుమూర్తి, దీప్లానాయక్, సత్తయ్య, వరద గాలెన్న, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

19న భగవద్గీత కంఠస్థ పోటీలు

స్టేషన్ మహబూబ్‌నగర్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఈనెల 19న జిల్లాస్థాయి భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ ఉత్తరపల్లి రామాచారి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులకు 1 నుంచి 30 శ్లోకాలపై, 18 ఏళ్ల లోపు, 18 ఏళ్లు నిండిన వారికి సంపూర్ణ భగవద్గీత 700 శ్లోకాలపై పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. పోటీలు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని, మధ్యాహ్నం బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని తెలిపారు.

కరాటేలో పతకాలు



మహబూబ్‌నగర్ క్రీడలు: జడ్చర్ల పట్టణంలో ఆదివారం జరిగిన సౌతిండియా కరాటే పోటీల్లో జిల్లా కేంద్రంలోని కింగ్‌షోటోకాన్ కరాటే అకాడమీ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఈ పోటీల్లో కటాస్ విభాగాల్లో మల్లేష్, మహ్మద్ అవేజ్, మారియబేగం, మహ్మద్ సాబీర్‌పాష బంగారు పతకాలు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులకు నిహాన్ షోటోకాన్ గ్రాండ్ మాస్టర్ రవీందర్‌కుమార్ మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

మొక్కులు చెల్లించుకున్న నాయకులు



బాలానగర్: పెద్దరేవల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు ఆదివారం శ్రీశైలం మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి గెలుపొందడంతో పాదయాత్రగా వెళ్లి మొక్కు చెల్లించుకున్నట్లు వివరించారు. నవీన్ రెడ్డి, వెంకటయ్య, ఉపేందర్ గౌడ్, తిరుమలయ్య, శ్రీనివాస్, సాయిచారి, శివ తేజ, సురేందర్, మణి, ఏలేష్ తదితరులు ఉన్నారు. వీరి పాదయాత్రకు మండల మాజీ అధ్యక్షుడు ఆదిరమణా రెడ్డి, సీనియర్ నాయకుడు సాదు వెంకట్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు.

మైసమ్మ చెంత భక్తుల సందడి



నవాబుపేట: మండల పరిధిలోని మైసమ్మ ఆలయం చెంత భక్తుల సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావటంతో జనం ఎక్కువగా వచ్చారు. ఏడాది ముగింపు రావటం పైగా మంచి ముహూర్తాలు ఉండటంతో అమ్మవారి చెంత భక్తులు పెరిగారు. ఈ సందర్భంగా భక్తులు మైసమ్మ దేవతకు బోనాలు సమర్పించారు. చెట్లనీడన సేదా తీరారు.

కిరాణ దుకాణంలో చోరీ

మిడ్జిల్: మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలోని పురుషోత్తం కిరాణా దుకాణంలో శనివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు షట్టర్ తాళం పగలగొట్టే ప్రయత్నం చేశారు. అది ఫలించకపోవడంతో, వెనుక వైపు ఉన్న తలుపు తాళాలు పగుల గొట్టి, రూ.20వేల నగదు, రూ.10వేల విలువగల సిగరెట్లు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు తెలిపారు. ఆదివారం ఉదయం దుకాణం తెరిచి చూడగా డబ్బులు మాయం కావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తెలిపారు.

బెడ్‌షీట్ల పంపిణీ

జడ్చర్ల టౌన్: వృద్ధాప్యంలో ఉన్నవారిని వారి పిల్లలు వదిలేయడం తగదని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ అన్నారు. తన తండ్రి కవి, రచయిత, తెలుగు పండితుడయిన నరసింహాసాగర్ వర్ధంతి పురస్కరించుకుని ఆదివారం పట్టణంలోని వృద్ధాశ్రమంలో బెడ్‌షీట్లు పంపిణీ చేశారు.

సమస్యల సాధనకు ఐక్యంగా ఉద్యమాలు



మాట్లాడుతున్న కుర్మయ్య

మహబూబ్‌నగర్ రూరల్: జిల్లాలో దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై సంబంధిత అన్ని సంఘాలను కలుపుకొని ఐక్య కార్యాచరణ ఉద్యమాలు చేయాలని నిర్ణయించామని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎం.కుర్మయ్య తెలిపారు. ఆదివారం జిల్లా కార్యాలయంలో అధ్యక్షుడు డి.వెంకట్రాములు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కుర్మయ్య మాట్లాడుతూ దళితులపై దాడులు, హత్యలు చోటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఇక భూసమస్యల పరిష్కారంపై దళితులు అధికారులకు విన్నవించుకున్నా లాభం లేకుండా పోతోందన్నారు. జనవరి 3న ప్రతి మండల కేంద్రంలో కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగం- దళితులు అనే అంశంపై జిల్లా సెమినార్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వెస్లీ పాల్గొంటారని అన్నారు. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు రాములు, లక్ష్మీదేవి, పాతూరు వేణు, మొగులయ్య పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసునమోదు

మహమ్మదాబాద్: యువతి అదృశ్యంపై కేసునమోదైన ఘటన ఆదివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండల కేంద్రానికి చెందిన ఓ యువతి స్థానికంగా ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తోంది. ఎప్పటి మాదిరిగా శుక్రవారం కూడా దుకాణానికి వెళ్లింది. కానీ తిరిగి రాలేదు. దీంతో తల్లిదండ్రులు చుట్టుపక్కల, బంధువుల ఇళ్ల దగ్గర వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ఆదివారం ఆమె తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

యాదవులకు న్యాయం చేస్తాం



ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: బీఆర్‌ఎస్ హయాంలో గొర్రెల కోసం డీడీలను కట్టిన యాదవులకు తమ ప్రభుత్వం న్యాయం చేస్తుందని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో యాదవ సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందజేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. నాణ్యమైన గొర్రెలను అందించే విధంగా ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. నెలలు గడిచినా గత ప్రభుత్వం మీ గోసను పెడచెవిన పెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీలైనంత త్వరగా చర్యలు తీసుకొని మేలు రకమైన గొర్రెలను పంపిణీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తామని హామీ ఇచ్చారు. యాదవ సహకార సంఘం జిల్లా చైర్మన్ శాంతయ్యయాదవ్, డైరెక్టర్ రాజగోపాల్‌యాదవ్, మాజీ జెడ్పీటీసీ పి.నర్సిములుయాదవ్, మాజీ ఎంపీపీ వెంకటేష్ యాదవ్, కోట్ల నర్సిములు, పర్వతాలు, కృష్ణయ్య, మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు అండగా ఉంటాం

పెన్షనర్లకు అండగా ఉంటామని ఏ సమస్య అయినా నిరభ్యంతరంగా తన దృష్టికి తీసుకు రావాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక టీఎన్జీఓ భవనంలో జరిగిన ప్రపంచ పెన్షనర్స్ దినోత్సవం పురస్కరించుకుని జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు సాయిలుగౌడ్, కార్యదర్శి కె.బాలకిషన్, టి.రాజేందర్‌రెడ్డి, గౌరవ అధ్యక్షుడు బి.ప్రభాకర్, పి.విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

స్టేషన్ మహబూబ్‌నగర్: క్రిస్టియన్‌కాలనీలోని ఎంబీ ప్రార్థనా మందిరంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ విల్సన్, సీజే బెనహర్, యేసు సుదర్శన్, స్వరూప్, ప్రవీణ్, ప్రశాంత్, సునీల్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎన్‌పీ వెంకటేశ్‌ను ఆదివారం జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, జి.మధుసూదన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి సన్మానించారు. ఎన్‌పీ వెంకటేశ్ జన్మదినాన్ని పురస్కరించుకొని కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



దేవరకద్ర రూరల్: కౌకుంట్ల మండలం, పుట్టపల్లి గ్రామంలో ఆదివారం బొడ్రాయి ప్రతిష్ఠాపన, పోచమ్మ తల్లి దేవాలయ ప్రారంభోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధల మధ్య నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే మధుసూధన్ రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, బీజేపీ నాయకుడు కొండ ప్రశాంత్‌రెడ్డితో పాటు ముఖ్య నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: ఎమ్మార్పీఎస్ (ఆర్ఆర్) ఆధ్వర్యంలో ఢిల్లీలో ఈనెల 19, 20వ తేదీలలో నిర్వహించ తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి ఆదివారం జిల్లా కేంద్రం నుంచి ఆ సంఘం నాయకులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి రాష్ట్ర అధ్యక్షుడు రాందాస్, టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పరమేశ్వర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లెల రాజశేఖర్, పాతూరి రమేష్, బుర్రన్న, తిరుమలయ్య, వినోద్, అరవింద్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్ ఆవరణలో గ్యార్మీ వేడుకలు



అన్నదానం ప్రారంభిస్తున్న ఎన్‌పీ వెంకటేశ్

స్టేషన్ మహబూబ్‌నగర్: ఐఎన్‌టీయూసీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఆదివారం గ్యార్మీ వేడుకలు నిర్వహించారు. ముందుగా ఫాతేహాలు నిర్వహించి దాదాపు 1500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమాన్ని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎన్‌పీ.వెంకటేశ్ ప్రారంభించారు. ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాములుయాదవ్ మాట్లాడుతూ తమ ఆటోయూనియన్ ఆధ్వర్యంలో ఏటా కులమతాలకతీతంగా అన్ని పండుగలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూనియన్ నాయకులు రాములుయాదవ్, హాష్మి, వినయ్‌కుమార్, శ్రీను, ఆంజనేయులు, లింగం, ఆలం, రాజు తదితరులు పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

జడ్చర్ల టౌన్: మండలంలోని నసురుల్లాబాద్ గ్రామంలోని 2, 3 వార్డుల్లో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రణీల్‌చందర్ ప్రారంభించారు. గ్రామపంచాయతీ, మండల సాధారణ నిధులు రూ.ఏడున్నరలక్షలతో పనులు చేపట్టారు. గ్రామంలో ఇప్పటికే 60శాతం పనులు పూర్తికాగా త్వరలోనే 100శాతం చేస్తామని సర్పంచ్ ప్రకటించారు. వార్డుసభ్యులు, గ్రామస్తులు నరేందర్, వెంకటేశ్, నిజాం, మునవర్, రాఘవేందర్, రాములు, మాసయ్య, శ్యామ్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు ఘనస్వాగతం



ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న కోట గ్రామస్తులు

రాజాపూర్: ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి ఆదివారం తన అమ్మమ్మ ఊరైన కోటగ్రామంలో స్థానికులు ఘనంగా స్వాగతం పలికారు. జడ్చర్ల ఎమ్మెల్యేగా విజయం సాధించిన తరువాత మొదటి సారిగా అనిరుధ్‌రెడ్డి ఏపీలోని తిరుపతి జిల్లా కోట మండల కేంద్రానికి వెళ్లారు. అక్కడ కోటమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న కొండ ప్రశాంత్‌రెడ్డి

దేవరకద్ర: కార్యకర్తలు ఎవరు అధైర్య పడవద్దని అపజయాన్ని విజయంగా మార్చుకోవడానికి అందరు పట్టుదలతో కృషి చేయాలని నియోజకవర్గ బీజేపీ నాయకులు కొండ ప్రశాంత్‌రెడ్డి కోరారు. ఆదివారం దేవరకద్రలో పార్టీ సమీక్షా సమావేశంలో మాట్లాడారు. త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు, అలాగే పార్లమెంట్ ఎన్నికలకు అందరు సిద్ధం కావాలని కోరారు. కాగా పార్టీని నమ్ముకుని పని చేస్తున్న కార్యకర్తలకు ఎల్లవేళల అండగా నిలుస్తామని పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ డోకూర్ పవన్ కుమార్‌రెడ్డి అన్నారు. గత ఎన్నికల్లో పని చేసిన కార్యకర్తలను మరిచి పోలేమని పేర్కొన్నారు. నాయకులు రాజేందర్‌రెడ్డి వివిధ మండలాల అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు, బూత్ కమిటీ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా కరాటే పోటీలు



పతకాలు సాధించిన విద్యార్థులతో కరాటే మాస్టర్లు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం బోయపల్లి గేటు సమీపంలో శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం 2వ జాతీయస్థాయి కరాటే చాంపియన్‌షిప్ నిర్వహించారు. ఈ పోటీలకు హైదరాబాద్‌తోపాటు ఉమ్మడిజిల్లాలోని పలు ప్రాంతాలు, ఇతర జిల్లాలకు చెందిన దాదాపు 250 మంది కరాటే విద్యార్థులు పాల్గొన్నారు. కుమితే, కతాస్ విభాగాల్లో బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు జరిగాయి. చాంపియన్‌షిప్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు. ఆత్మరక్షణ కోసం కరాటే విద్య ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం ఉపాధ్యక్షుడు ఎన్‌పీ వెంకటేశ్ కరాటే విద్యార్థులను అభినందించారు. అనంతరం ప్రతిభచాటిన వారికి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. ఆర్గనైజర్ మాస్టర్ కె.వెంకటేష్, సీపీఐ పట్టణ ఉపాధ్యక్షుడు కోటకదిర నర్సింలు, మాస్టర్లు కుమార్, ఎతినె చెన్నయ్య, రాజశేఖర్‌రెడ్డి, నవీన్, మల్లేష్‌యాదవ్, అరుణ్‌రాజ్, మహేష్, ఆంజనేయులు, శివశంకర్, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పూజ నిర్వహిస్తున్న మాలాధారులు

దేవరకద్ర: మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ నిర్వహించారు. దీంతో పట్టణంలోని కురుమవాడ ప్రాంతం అయ్యప్పస్వామి నామస్మరణతో మార్మోగింది. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, టీపీసీసీ నాయకులు అరవిందరెడ్డి వేడుకలో పాల్గొన్నారు. నిర్వాహకులు వారికి ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు.

20న మహాపడిపూజ

జడ్చర్ల టౌన్: పట్టణంలో ఈనెల 20న అయ్యప్ప స్వామి మహాపడిపూజ నిర్వహిస్తున్నట్లు గురుస్వామి బాదేపల్లి రంజిత్‌బాబు తెలియజేశారు. సాయంత్రం 7గంటలకు నిర్వహించే పడిపూజకు గురుస్వాములు గిరీష్‌నాయర్, సతీష్‌నాయర్‌లు హాజరవుతారని తెలిపారు. భిక్ష సంతర్పణ, రాత్రి అల్పాహారం ఉంటుందని భక్తులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

అయోధ్య రామయ్య అక్షింతల ఊరేగింపు



కోయిల్‌కొండలో..



నవాబుపేటలో..



మూసాపేటలో అక్షింతలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం శ్రీరాముని అక్షంతలను ఊరేగింపు చేపట్టారు. వచ్చే నెలలో అయోధ్యలోని రామమందిరంలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉన్న నేపథ్యంలో అక్కడి నుంచి వచ్చిన అక్షింతలను మహబూబ్‌నగర్ నుంచి మూసాపేటకు తీసుకొచ్చారు. ఈ సందర్భంగా బస్టాండ్ నుంచి ఆంజనేయస్వామి దేవాలయం వరకు గ్రామస్తులు మేళతాళాల సవ్వడిలో ఊరేగింపు చేశారు. అక్షింతలను ఆలయంలో ఉంచారు. ఈనెల 22న అక్షింతలకు పూజలు చేసి మండలంలోని అన్ని గ్రామాల్లో జనవరి 1 నుంచి వాటిని ప్రతి ఇంటికి చేర్చాల్సి ఉందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ముచ్చర్ల లింగమయ్య, నాగిశెట్టి, శ్రీనివాసులు, యాదయ్య శెట్టి, ఎన్‌టీగౌడ్, తిరుపతయ్య, చంద్రమోహన్‌గౌడ్, మధు, సుధాకర్, నారాయణ, ప్రసాద్, రాజు తదితరులు ఉన్నారు.

నవాబుపేట: ఇంటికి అయోధ్య రామయ్య అక్షింతలు అందిస్తామని వీహెచ్‌పీ నాయకులు చంద్రశేఖర్, శివ, సుధాకర్, శ్రీకాంత్ తెలిపారు. ఆదివారం అయోధ్య నుంచి మండల కేంద్రానికి అక్షింతలు చేరాయి. ఈ సందర్భంగా అక్షింతలతో ఆదివారం గ్రామంలో ఊరేగింపు నిర్వహించి హనుమాన్, శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కోయిల్‌కొండ: అయోధ్య నుంచి అక్షింతలు వచ్చిన సందర్భంగా ఆదివారం మండలకేంద్రంలో ఆదిఆంజనేయస్వామి ఆలయం నుంచి లక్ష్మీనరసింహస్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ముక్కోటీ ఏకాదశి సందర్భంగా శనివారం మండలంలోని 44 గ్రామపంచాయతీలకు అంక్షితలు పంపిణీ చేస్తామని అర్చకులు రాఘురామాచారి, రాఘవేందర్‌రావులు తెలిపారు.